సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం ׀ 22 ׀ నవంబర్ ׀ 2023



రాజన్న సేవలో..

వేములవాడ: వేములవాడ రాజన్నను మంగళవారం సిద్దిపేట అసెంబ్లీ ఎన్నికల వ్యయ పరిశీలకులు మన్మోహన్ ప్రసాద్ దర్శించుకున్నారు.



ఎల్‌ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి: మిడ్‌మానేరు నుంచి మంగళవారం ఎల్‌ఎండీకి 5 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ప్రాజెక్టులోకి 3,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

గరిష్టం/కనిష్టం
31.0/21.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సీఎం కేసీఆర్ సభ ఏర్పాట్లు పరిశీలన



సభాస్థలిని పరిశీలిస్తున్న వినోద్‌కుమార్, నాయకులు

వేములవాడ: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ 26న వేములవాడకు రానున్నారు. ఈసందర్భంగా నిర్వహించే బహిరంగసభ స్థలిని మంగళవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావును భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఓటర్లను కోరేందుకు సీఎం రానున్నట్లు తెలిపారు. బాలానగర్ ప్రాంతంలోని ఖాళీ ప్రదేశంలో బహిరంగ సభా ప్రాంగణంతో పాటు హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాఘవరెడ్డి, బండ నర్సయ్య, రాజు, మారం కుమార్, యాచమనేని శ్రీనివాసరావు, రాము, తిరుపతి, జోగిన్‌పల్లి అజిత్‌రావు, దూలం సంపత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ'కు స్పందన



సిరిసిల్ల పీఎస్‌నగర్ యూహెచ్‌సీలో ఆరోగ్య మహిళ కార్యక్రమం

సిరిసిల్లటౌన్: జిల్లాలో ఆరోగ్యమహిళ కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్‌రావు ప్రకటనలో తెలిపారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీఎస్‌, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ హెల్త్‌సెంటర్లలో నిర్వహించిన ఆరోగ్య మహిళ శిబిరాల్లో ఓపీడీ 617, బ్రెస్ట్ 617, ఓరల్ కావిటీ 617 పరీక్షలు చేసినట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా యూటీఐ 18, ల్యాబ్ 82, థైరాయిడ్ 60, విటమిన్ డీ 46, సీబీపీ 89, సూక్ష్మ పోషకాలు 63 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వీరిలో 17 మంది పేషెంట్లను జిల్లాసుపత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు. ఆయా ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన డీఈవో



విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈవో రమేశ్‌కుమార్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని పలు గ్రామాల ప్రభుత్వ పాఠశాలలను జిల్లా విద్యాధికారి ఎ.రమేశ్‌కుమార్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా తాడూర్, గోపాల్‌రావుపల్లె పాఠశాలల విద్యార్థులతో మాట్లాడారు. పలు సందేహాలను నివృత్తి చేస్తూ సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎస్‌వో కె.వెంకన్న, ప్రధానోపాధ్యాయులు బూర రవీందర్, చందనపు రవీందర్, ఉపాధ్యాయులు విష్ణుప్రసాద్‌రావు, అపర్ణ, భాస్కర్, చంద్రమౌళి, రమేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

26న మహిళా కబడ్డీ సెలక్షన్స్ ట్రయల్స్

సిరిసిల్లటౌన్: వచ్చే నెలలో జరిగే రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు క్రీడాకారుల సెలక్షన్స్ ట్రయల్స్‌ను ఈనెల 26న సిరిసిల్లలో నిర్వహించనున్నారు. ఈమేరకు మంగళవారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సింగారపు తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెలక్షన్స్ ట్రయల్స్ జిల్లా కేంద్రంలోని పత్తిపాక వీధిలో సిద్దార్థ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి జరుగుతాయని వివరించారు. ఈసందర్భంగా సెలక్షన్స్ ట్రయల్స్‌లో పాల్గొనే క్రీడాకారులు 75 కేజీలలోపు బరువు ఉండాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు మదన్ పీఈటీని 99595 25384 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

కేసుల చిట్టా విప్పాల్సిందే!

జంగ్ తెలంగాణ

- సుప్రీం ఆదేశాలతో ముందుకు వస్తున్న అభ్యర్థులు
- కేసులు ఉన్నా లేకున్నా దినపత్రికల్లో వెల్లడిస్తున్న వైనం
- కొందరికి అనుకూలం, మరికొందరికి ప్రతికూలం
- నేర స్వభావం చూసి ఓటేయాలంటున్న మేధావులు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులందరూ తమపై ఎన్ని కేసులు ఉన్నాయో ప్రజలకు తెలిపేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల నామినేషన్లు వేసిన సమయంలో కేసుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇప్పుడు వాటిని ప్రముఖ దినపత్రికల్లో ప్రకటనల ద్వారా తెలియజేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పారదర్శకంగా వ్యవహరించాలని, ఎలాంటి నేరచరిత్ర ఉన్నా బయటపెట్టాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తమ కేసుల చిట్టాను విప్పుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల నుంచి మొత్తంగా 216 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇప్పుడు వీరంతా తమపై కేసులు ఉన్నా లేకున్నా పత్రికా ప్రకటనలు అనివార్యంగా ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎవరికీ మినహాయింపు లేదు..

రాజకీయంగా పారదర్శకత పాటించే ఏ నాయకుడికీ ఈ ప్రకటనలు ఇచ్చేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవు. ఎందుకంటే రాజకీయ నాయకుడు అన్నాక కేసులు ఉండటం సర్వసాధారణం. ప్రజాసమస్యల పోరాటంలో భాగంగా అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ఏదో ఒక సమయంలో ధర్నాలు, రాస్తారోకోలు చేయాల్సి వస్తుంది. మన రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమంలో దాదాపు అన్ని పార్టీల నాయకులపైనా కేసులు నమోదయ్యాయి. అందులో చాలామటుకు కొట్టుడుపోగా.. ఇంకొన్ని విచారణ దశలో ఉన్నాయి. కానీ, రాజకీయ జీవితం మొదలు కాకముందు, రాజకీయాల్లోకి వచ్చాక వ్యక్తిగత కారణాలతో నమోదైన క్రిమినల్ కేసులు కొందరిని తీవ్రంగా ఇబ్బంది పెట్టబోతున్నాయి. వీటిలో ప్రధానంగా భూకబ్జాలు, ఫోర్జరీలు, మోసాలు, హత్యాయత్నాలు ఉన్న వారికి ఈ ప్రకటనల జారీ ప్రతికూలంగా మారనుంది. చిన్న కేసు ఉన్నా తక్కువలో తక్కువ 12 సెం.మీల పొడవు, వెడల్పు విస్తీర్ణం కలిగిన యాడ్ ఇవ్వాల్సి వస్తోంది. అంతే కాకుండా, కేసుల వివరాలు, నేరం స్వభావం, నమోదైన ఐపీసీ సెక్షన్లు, విచారణ స్థితిగతులు తదితరాలు పట్టికలో స్పష్టంగా పొందుపర్చాల్సి ఉంటుంది. కనీసం మూడు రోజులపాటు జిల్లా ప్రజా సంబంధాల అధికారి వద్ద నమోదైన గుర్తింపు పొందిన దినపత్రికల్లో ప్రచురించాలి. ఈ వ్యవహారంలో లేని వారికి మినహాయింపు ఏమీ లేదు. వారు కూడా తమపై కేసులు లేవని ప్రకటన ఇస్తున్నారు.

వెల్లడించకపోతే న్యాయపరమైన చిక్కులు

అభ్యర్థి నేరాల పట్టికను చదివిన వారికి అతని గుణంపై నిర్దిష్టమైన అభిప్రాయానికి వచ్చే అవకాశాలున్నాయి. స్మార్ట్‌ఫోన్లు వచ్చాక ఏ నేరానికి ఏ సెక్షన్ పెడతారన్నది తెలుసుకోవడం క్షణాల్లో పని. ఎందుకంటే దురుద్దేశంతో చేసిన నేరానికి, ప్రజాపోరాటాల్లో భాగంగా నమోదైన కేసులకు స్పష్టమైన తేడా ఉంటుంది. ఇందులో ప్రజాసమస్యలపై పోరాటాలు చేసిన వారికి ఇది కలిసి వచ్చే అంశం కాగా, ఉద్దేశపూర్వక నేరచరితులకు మాత్రం ముమ్మాటికీ గండమే. ఒకవేళ కేసుల విషయాలు వెల్లడించకపోతే.. సదరు అభ్యర్థి భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోక తప్పదు. ఒకవేళ గెలిచి పదవిలో ఉంటే ప్రతిష్ఠ మరింత దిగజారే అవకాశాలున్నాయి.

నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల వివరాలు..

కరీంనగర్‌లో 27, హుజూరాబాద్‌లో 22, చొప్పదండిలో 14, మానకొండూరులో 10, సిరిసిల్లలో 21, వేములవాడలో 16, పెద్దపల్లిలో 17, మంథనిలో 21, రామగుండంలో 23, జగిత్యాలలో 15, కోరుట్లలో 15, ధర్మపురిలో 15 మంది అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు.

మంచి వ్యక్తులను ఎన్నుకోవాలి

మంచి వ్యక్తిత్వం, సమాజానికి సేవ చేయాలన్న భావాలున్న వ్యక్తులను ఎన్నికల్లో ఎన్నుకోవాలి. వ్యక్తిగత నేరస్వభావం ఉన్న వారి గురించి ఆలోచించాలి. డబ్బులున్న వారికే టికెట్లు ఇచ్చే ధోరణిని రాజకీయ పార్టీలు మార్చుకోవాలి. నైతిక విలువలు, ప్రజల సమస్యలు పట్టించుకునేవారికి ఇవ్వాలి. ప్రజలు కూడా అలాంటి వారికే ఓటు వేయాలి.

– బుర్ర మధుసూదన్‌రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్, ఎస్సారార్ కళాశాల

సిరిసిల్లలో వైఎస్సార్ అడుగులు

జ్ఞాపకం



సిరిసిల్ల: దివంగత నేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి 2009లో ముఖ్యమంత్రి హోదాలో సిరిసిల్లలో ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. అప్పటి సిరిసిల్ల కాంగ్రెస్ అభ్యర్థి, మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న గుడ్ల మంజుల పక్షాన వైఎస్సార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కళాశాల మైదానంలో జరిగిన సభలో అప్పటి కరీంనగర్ ఎంపీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్, వేములవాడ అభ్యర్థి ఆది శ్రీనివాస్, జగిత్యాల అభ్యర్థి జీవన్‌రెడ్డి ఉన్నారు. సిరిసిల్లలో వైఎస్సార్ అడుగుజాడలను ఆయన అభిమానులు గుర్తు చేసుకుంటున్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి సారించండి

- ఎస్పీ అఖిల్ మహాజన్



జోగాపూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

చందుర్తి(వేములవాడ): సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. చందుర్తి మండలం నర్సింగాపూర్, తిమ్మాపూర్, ఆశిరెడ్డిపల్లె, జోగాపూర్, మల్యాల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం సాయంత్రం సందర్శించారు. అనంతరం చందుర్తి ఠాణాలో మాట్లాడారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో ప్రచారం ఎక్కువగా జరుగుతోందని, ఎలాంటి సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అంకితభావంతో విధులు నిర్వహించి, ప్రజల గర్వించేలా వ్యవహరించాలని ఆదేశించారు. ఎస్పీ వెంట వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై అశోక్, సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో ముందే పోలింగ్ షురూ

- ఇంటి నుంచి ఓట్లు వేస్తున్న వృద్ధులు, దివ్యాంగులు
- 25 వరకు హోమ్ ఓటింగ్



ఇంటి నుంచి ఓట్లు వేయించేందుకు వెళ్తున్న పోలింగ్ సిబ్బంది

సిరిసిల్ల: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో హోం ఓటింగ్ మంగళవారం ప్రారంభమైంది. ఈనెల 25 వరకు అధికారులు ఇంటి నుంచే ఓటు వేసేందుకు (హోం ఓటింగ్) అవకాశం కల్పించారు. 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతం పైగా వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటు వేసేలా ఎన్నికల సంఘం తొలిసారి కల్పించింది. ఈనేపథ్యంలో వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల పరిధిలో 989 మందికి ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం వచ్చింది. హోమ్ ఓటింగ్ కోసం సిరిసిల్ల నియోజకవర్గంలో 5, వేములవాడలో 9 బృందాలు ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ప్రిసైడింగ్ అధికారి, సహాయ ప్రిసైడింగ్ అధికారి, మైక్రో అబ్జర్వర్, పోలీస్ అధికారి, వీడియోగ్రాఫర్ మొత్తం 5 మంది ఉంటారు. అధికారిక వాహనంలో ఓటరు ఇంటింటికి వెళ్లి సాధారణ పోలింగ్ కేంద్రం మాదిరి ఏర్పాటు చేస్తారు. రహస్య విధానంలో ఓటర్లు బ్యాలెట్ పేపర్ పై తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలి. తర్వాత బ్యాలెట్ పేపరును చిన్న కవరు (ఫామ్ 13బీ)లో ఉంచి ఎన్నికల అధికారికి ఇవ్వాలి. ఓటు ధ్రువీకరణ పత్రం ఫామ్ 13ఏ పైన సంతకం చేయాలి. ఆ రెండు ఫామ్‌లను పెద్ద కవరులో వేసి, ఓటును సీల్ చేస్తారు. ఇలా జిల్లాలో ఇంటి నుంచి ఓటింగ్ విధానం అమలు చేశారు.

అభ్యర్థుల లెక్కలు పక్కాగా ఉండాలి

- ఎన్నికల పరిశీలకులు డాక్టర్ జగదీశ్ సోన్‌కర్



వ్యయ పరిశీలకులతో సమీక్షిస్తున్న జగదీశ్ సోన్‌కర్

సిరిసిల్ల: ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చుల నమోదు పక్కాగా ఉండాలని సాధారణ పరిశీలకులు డాక్టర్ జగదీశ్ సోన్‌కర్ అన్నారు. సిరిసిల్ల, వేములవాడ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో మంగళవారం ఎన్నికల పోలీస్ పరిశీలకులు వినిత సాహు, వ్యయ పరిశీలకులు జి.మణిగండసామితో కలిసి అభ్యర్థుల ఎన్నికల అకౌంట్‌లను రెండోసారి తనిఖీ చేశారు. క్రిమినల్ యాంటిసిడెంట్స్, సీ విజిల్, సువిధ తదితర అంశాల గురించి కూలంకషంగా వివరించారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లసందేహాలను పరిశీలకులు నివృత్తి చేశారు. రిటర్నింగ్ అధికారులు ఎస్.ఆనంద్‌కుమార్, మధుసూదన్, జిల్లా వ్యయ పర్యవేక్షణ కమిటీ ప్రత్యేక అధికారి స్వప్న, నోడల్ అధికారి రామకృష్ణ, లైజన్ అధికారి నర్సింహులు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ హైదరాబాద్ నుంచి జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర స్థాయి ఉన్నతస్థాయి అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు. పట్టణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో వంద శాతం, గ్రామీణ ప్రాంతాల్లోని కేంద్రాల్లో 60 శాతం వెబ్ క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. సిరిసిల్ల, వేములవాడ పరిధిలో ఈవీఎం యంత్రాల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో ఆనంద్‌కుమార్, నోడల్ అధికారులు లక్ష్మీరాజం, జితేంద్రప్రసాద్, కంట్రోల్ రూం బాధ్యులు రఫీ, రామిరెడ్డి, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

బ్యాలెట్ యూనిట్ ర్యాండమైజేషన్ పూర్తి

సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల నిర్వహణకు అదనంగా కేటాయించిన బ్యాలెన్స్ బ్యాలెట్ యూనిట్‌లకు ర్యాండమైజేషన్ మంగళవారం పూర్తి చేశారు. కలెక్టర్ అనురాగ్ జయంతి ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రక్రియ పూర్తయింది. సిరిసిల్ల నియోజకవర్గానికి 359, వేములవాడ నియోజకవర్గానికి 325 బ్యాలెట్ యూనిట్‌లు కేటాయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ర నేతలొస్తున్నారు..



నరేంద్రమోదీ, అమిత్‌షా, కేసీఆర్, యోగీ ఆదిత్యనాథ్, మాయావతి, ప్రియాంకా గాంధీ, రేవంత్‌రెడ్డి

- ఉమ్మడి జిల్లాకు ప్రధాని మోదీ, మాయావతి, యోగి, అమిత్‌షా, ప్రియాంకా గాంధీ, రేవంత్‌రెడ్డి, పవన్‌కల్యాణ్
- రేపటి నుంచి 28 వరకు వరుస పర్యటనలు
- భారీ బహిరంగ సభలతో హోరెత్తనున్న ప్రచారం
- జనసమీకరణతో బలనిరూపణకు సిద్ధమవుతున్న పార్టీలు

ఏ రోజు ఎవరు..

23న – మాజీ సీఎం మాయావతి (పెద్దపల్లి)
24న – ప్రియాంకా గాంధీ (హుస్నాబాద్, ధర్మపురి)
24న – సీఎం కేసీఆర్ (రామగుండం)
25న – యూపీ సీఎం యోగి (వేములవాడ)
26న – పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి (పెద్దపల్లి)
27న – ప్రధాని మోదీ (కరీంనగర్)
28న – హోంమంత్రి అమిత్‌షా (పెద్దపల్లి)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ పోలింగ్ సమయం సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీలు తమ ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నాయి. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అన్ని పార్టీల అధినేతలు ఉమ్మడి జిల్లాలో ప్రచారం చేసేందుకు రానున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు నుంచే మంత్రి కేటీఆర్ సుడిగాలి పర్యటనలతో గులాబీ శ్రేణుల్లో ఎన్నికల జోష్ నింపారు. షెడ్యూల్ విడుదలయ్యాక సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాలోని హుస్నాబాద్ నుంచే ఎన్నికల శంఖారావం పూరించి, పలు నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహించారు. బీజేపీకి మద్దతుగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కోరుట్లలో ధర్మపురి అరవింద్‌కు మద్దతుగా బహిరంగ సభలో పాల్గొన్నారు. తాజాగా మరోమారు పెద్దపల్లిలో నిర్వహించే బహిరంగ సభకు రానున్నారు. బీఎస్పీ రాష్ట్ర చీఫ్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో ఆ పార్టీ పెద్దపల్లి అభ్యర్థి దాసరి ఉష జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభ నిర్వహించి, సత్తా చాటారు. రామగుండం బీజేపీ అభ్యర్థి కందుల సంధ్యారాణికి మద్దతుగా ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ప్రచారం చేశారు. ఎమ్మెల్సీ కవిత రామగిరి, పెద్దపల్లిల్లో ప్రచారంలో పాల్గొన్నారు.

బీఎస్పీకి మద్దతుగా మాయావతి

పెద్దపల్లి బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉషకు మద్దతుగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఈ నెల 23న పెద్దపల్లి జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు.

బీజేపీ అభ్యర్థుల కోసం ప్రధాని మోదీ..

కరీంనగర్ బీజేపీ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా ఎస్సారార్ కాలేజీలో ఈ నెల 27న మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. ప్రధాని హోదాలో ఆయన మొదటిసారి కరీంనగర్‌కు వస్తుండటంతో భారీ జనసమీకరణతో సభ సక్సెస్ చేసేందుకు ఆ పార్టీ నాయకులు సిద్ధమవుతున్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సైతం ఈ సభకు రానున్నారు. అలాగే, బీజేపీ పెద్దపల్లి అభ్యర్థి దుగ్యాల ప్రదీప్‌రావును గెలిపించాలంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఈ నెల 28న పెద్దపల్లికి రానున్నారు. వేములవాడలో 25న నిర్వహించే బహిరంగ సభలో ఉత్తరప్రదేశ్ సీఎం యోగి పాల్గొననున్నారు. బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ఎంపీ బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌లు పలు నియోజకవర్గాల్లో రోడ్‌షోలలో పాల్గొననున్నారు. అలాగే ఎమ్మార్పీస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ త్వరలో రామగుండంలో పర్యటించనున్నారు.

హుస్నాబాద్, ధర్మపురికి ప్రియాంకా గాంధీ

ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకా గాంధీ ఈ నెల 24న మధ్యాహ్నం 2 గంటలకు హుస్నాబాద్‌లో, సాయంత్రం 4 గంటలకు ధర్మపురిలో జరిగే బహిరంగ సభలకు హాజరవుతారు. అలాగే, పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావుకు మద్దతుగా 26న నిర్వహించే విజయభేరి సభలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు.

మరోసారి గులాబీ దళపతి..

సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ అభ్యర్థుల కోసం సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఈ నెల 24న సింగరేణి స్టేడియంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు మద్దతుగా నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు హాజరుకానున్నారు. మంత్రి కేటీఆర్ రామగుండం, మంథనిల్లో రోడ్ షోలు నిర్వహించనున్నారు. వారం రోజుల్లో ఇలా అగ్రనేతలు రానుండటంతో అందరి దృష్టి ఉమ్మడి జిల్లాపై పడింది.

పార్టీ ఏదైనా వేదికలు ఇవే..

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయా పార్టీల సభలను ఒక్కటే ప్రాంగణంలో నిర్వహిస్తుండటం గమనార్హం. కరీంనగర్‌లో ఎస్సారార్ కాలేజీ గ్రౌండ్, పెద్దపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం, రామగుండంలో సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియమే వేదికలవుతున్నాయి.

బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- సీఐ శశిధర్‌రెడ్డి



ఆలయ బాధ్యులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలను ప్రశాంత వాతవరణంలో శాంతియుతంగా నిర్వహించుకోవాలని సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్ అన్నారు. ప్రతీ కార్తీకమాసంలో అంగరంగ వైభవంగా నిర్వహించే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులతో ఏర్పాట్లపై చర్చించారు. ఏటా ఇదే మాసంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు హైదరాబాద్, కరీంనగర్, కామారెడ్డి, సిద్దిపేట, జగిత్యాల జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. అందుకు అనుగుణంగా ఆలయ కమిటీ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయడం ఆనవాయితీ. అయితే వారం రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసుల సహకారం తీసుకోవాలని సీఐ సూచించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. రోజు జరిగే కార్యక్రమాల సమాచారం పోలీసులకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్, వైస్ చైర్మన్ గంట వెంకటేశ్ గౌడ్, వేదపండితులు నవీన్‌చారి, గోపాలచారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూం పరిశీలన



స్ట్రాంగ్ రూం భద్రతపై సూచనలిస్తున్న ఎస్పీ అఖిల్

సిరిసిల్లక్రైం: పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూంను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూం వద్ద కేంద్ర సాయుధ బలగాలు ఏర్పాటు చేసిన గార్డ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్, సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్, ఎస్బీ సీఐ అనిల్‌కుమార్, తహసీల్దార్ షరీఫ్ మొహినొద్దీన్ ఉన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని మల్కాపూర్ గ్రామంలో బెల్ట్ షాపులో అక్రమంగా లిక్కర్ విక్రయిస్తున్న తిరుపతి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.శ్రీకాంత్ మంగళవారం సాయంత్రం తెలిపారు. బెల్ట్ షాపులో లిక్కర్ విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సోదాలు చేయగా.. 3.6లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గతంలో బైండోవర్ చేసినా లిక్కర్ విక్రయించడంతో తిరుపతి వద్ద లిక్కర్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. బైండోవర్ నిబంధనలు అతిక్రమించినందుకు రూ.లక్ష జరిమానా విధించాలని తహసీల్దార్‌కు నివేదిక పంపినట్లు తెలిపారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య, పీసీలు రాజ్‌కుమార్, వెంకటేశం ఉన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ధర్మారం(ధర్మపురి): మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన బద్దం మౌనిక (24) అనే వివాహిత సోమవారం ఆత్మహత్యాయత్నం చేయ గా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మరణించినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. మౌనికకు వివాహమై నాలుగు సంవత్సరాలు గడిచినా సంతానం కలగలేదని మనోవేదన గుర్తై, ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. ఆ తర్వాత వచ్చిన కుటుంబసభ్యులు గమనించి, వెంటనే కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి దొడ్ల కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బీజేపీ కార్యకర్తలపై కేసు

కరీంనగర్ క్రైం: నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారం నిర్వహించినందుకు బీజేపీ కార్యకర్తలపై కేసు చేసినట్లు కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు తెలిపారు. బీజేపీ నాయకుడు బాస సత్యనారాయణరావు నగరంలోని అశోక్‌నగర్‌లో ప్రచారం కోసం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అనుమతి తీసుకున్నారని అన్నారు. కానీ కార్యకర్తలు మంగళవారం ఉదయం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారని పేర్కొన్నారు. వారిపై ఎన్నికల పర్యవేక్షణాధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



గంగారాం(ఫైల్)

రాయికల్: రాయికల్ పట్టణానికి చెందిన ఇంద్రాల గంగారాం(38) అనే యువకుడు మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. గంగారాం ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో జీవితం మీద విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కూమారుడు, కూతురున్నారు.

పోలింగ్‌పై అవగాహన పెంపొందించుకోవాలి

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



సూచనలు చేస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడఅర్బన్: వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనీ జేఎన్టీయూ కళాశాలలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం జరుగుతున్న తీరును జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ రోజు పోలింగ్ స్టేషన్ లోపల, వెలుపల కార్యకలాపాల నిర్వహణ, ప్రిసైడింగ్ అధికారులు చేయాల్సిన, చేయకూడని అంశాలను కలెక్టర్ వివరించారు. ఎన్నికల ఘట్టంలో పోలింగ్ నిర్వహణ రోజు ముఖ్యమైందన్నారు. పోలింగ్ దృష్ట్యా చేయాల్సిన అన్ని అంశాలపై ఎన్నికల సంఘం రూపొందించిన హ్యాండ్ బుక్‌ను ప్రతీ ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు తప్పకుండా చదవడమే కాకుండా.. అందులోని అన్ని నియమాలను పాటించాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం జారీ చేస్తున్న నిబంధనలు, నియమాల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికలపై ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వద్దన్నారు. శిక్షణ పొందిన నా టి నుంచి పోలింగ్ ముగిసేవరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అన్ని అంశాలపై పూర్తి అవగాహన ఉండాలని అన్నారు. పార్టీలు, అభ్యర్థులకు అనుకూలంగా ఉండొద్దన్నారు. కేంద్ర ఎన్ని కల సంఘం మార్గదర్శకాల మేరకు జాగ్రత్తగా విధులు నిర్వహించాలని అన్నారు. పోలింగ్ ముందు రోజు చేయాల్సిన పనులను చెక్‌లిస్టు తయారు చేసుకొని విధులు నిర్వహించాలని సూచించారు. మెటీరియల్, ఈవీఎంల నిర్వహణ, ఓటరు జాబితా, మార్క్కుడ్ కాపీ, పీవో, ఏపీవో డైరీ, వారి విధులు, పోలింగ్ కేంద్రం బయట ప్రదర్శించాల్సిన సామగ్రి, పోలింగ్ కేంద్రంలోకి అనుమతించేవారు, మాక్ పోల్, ఈవీఎం, వీవీ ప్యాట్‌లను ఎలా అనుసంధానం చేయాలి వంటి అన్ని విషయాలు ఒకటికి రెండుసార్లు చదువుకోవాలన్నారు. పోలింగ్ నిర్వహణపై సిబ్బందికి ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వాలని ట్రైనర్‌లకు సూచించారు.

కేంద్రాల పరిశీలన

ఫారం–12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకొని ఎన్నికల పోలింగ్ శిక్షణకు వచ్చిన పీవో, ఏపీవో, వోపీవో సిబ్బందికి అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జేఎన్టీయూ కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫెలిసిటేషన్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల సంఘం నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ పోస్టల్ బ్యాలెట్ ఫెలిసిటేషన్ కేంద్రాల్లో సిబ్బంది ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. రిటర్నింగ్ అధికారి మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.గంగయ్య, తహసీల్దార్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా..!

- బస్సు పైకి ఎక్కి విద్యార్థుల ప్రయాణం



బస్సుపై ప్రయాణిస్తున్న విద్యార్థులు

సిరిసిల్లటౌన్/తంగళ్లపల్లి: ఎన్నికల వేళ సామాన్యులకే కాదు.. బడికి వెళ్లే విద్యార్థులకూ బస్సు కష్టాలు తప్పడం లేదు. రాజకీయ పార్టీల సభలు, ఇతర కార్యక్రమాలకు బస్సులు అద్దెకు పోతుండటంతో.. పక్షం రోజులుగా బస్సుల కొరతతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం జిల్లా కేంద్రం నుంచి తంగళ్లపల్లి మండలం టెక్స్‌టైల్ పార్క్కు వెళ్లే బస్సులో మోడల్ స్కూల్‌కు వెళ్లేందుకు విద్యార్థులు సర్కస్ ఫీట్లు చేయాల్సి వచ్చింది. ప్రతిరోజు ఉదయం 8గంటల నుంచి 9వరకు మూడు బస్సులు నడవాల్సి ఉండగా.. ఒక బస్సును మాత్రమే నడిపించినట్లు స్థానికులు తెలిపారు. దీంతో వేరే దారి లేక విద్యార్థులు ప్రమాదమని తెలిసినా బస్సు మీదికెక్కి బడికి బయల్దేరారు. విద్యార్థుల బస్సు కష్టాలను చూసిన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానుకూలంగా ఆర్టీసీ అధికారులు బస్సులు నడపకుండా ఇలా చేస్తే అనర్థం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.

ఇలా జరగకుండా చూస్తాం

మంగళవారం ఉదయం టెక్స్‌టైల్ పార్క్కు వెళ్లే బస్సులు మూడింటిలో రెండు ఖాళీగా పోయాయి. బస్టాండులో ఇతర కార్యక్రమం ఉండటంతో రోడ్డు వైపు బస్సులు ఆగడంతో విద్యార్థులు గందరగోళానికి లోనయ్యారు. మేము స్వయంగా పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడాం. బుధవారం నుంచి ఉదయం 7.30, 8.20, 8.30 గంటలకు మూడు ట్రిప్పుల్లో బస్సులు నడుపుతాం. మళ్లీ ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా చూస్తాం.

– మనోహర్, సిరిసిల్ల డిపో మేనేజర్

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌పై వివాదం



సనుగులలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌ను వినియోగించుకుంటున్న దివ్యాంగుడు



మల్యాలలో ఎన్నికల అధికారులు

- సోషల్ మీడియాలో వైరల్

చందుర్తి(వేములవాడ): మండలంలోని మల్యాలలో మంగళవారం జరిగిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌పై ఎన్నికల అధికారులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలపై బీఆర్ఎస్ నాయకులకు సమాచారం లేదో ఏమో గానీ అనుకున్న సమయంలో పోలింగ్ ఏజెంట్ పాసులు తీసుకోలేకపోయారు. దీంతో వారిని పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ వద్దకు వచ్చేందుకు ఎన్నికల అధికారులు నిరాకరించారు. గ్రామానికి చెందిన చింతం మల్లేశం అనే దివ్యాంగుడు ఓటు వేసే సమయంలో అతడి భార్య అందుబాటులో లేకపోవడంతో అతడి చిన్నమ్మతో ఓటు వేయించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. అందుకు మల్లేశం నిరాకరించి కాంగ్రెస్‌కు చెందిన సంటి ప్రసాద్‌ను పంపించాలని కోరాడు. ప్రసాద్ సహాయంతో ఓటు వేశాడు. దీంతో అక్కడే ఉన్న బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ నాయకుడు ఈర్లపెల్లి రాజు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయిస్తున్నారంటూ ఎన్నికల అధికారులతో వాగ్వాదానికి దిగాడు. ఈక్రమంలో మల్లేశం సూచించిన వ్యక్తితో ఓటు వేయించామని బదులిచ్చి అక్కడి నుంచి అధికారులు వెళ్లిపోయారు. ఈ ఘటనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని రాజు పేర్కొన్నాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ విషయమై సెక్టార్ అధికారి రవీందర్‌ను వివరణ కోరగా.. వివాదం ఏమీ జరగలేదని చెప్పారు. కాగా మండలంలోని మల్యాలలో 18 మంది, సనుగులలో 12, లింగంపేటలో ఆరుగురు పోస్టల్ బ్యాటిల్ పోలింగ్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

21 లీటర్ల నాటుసారా స్వాధీనం



బెల్లం పానకం పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

సారంగాపూర్: రేచపల్లి, దాని చుట్టు పక్క గ్రామాల్లో మంగళవారం ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. 900 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. 21 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. మ్యాడారంతండాకు చెందిన బానావత్ జగన్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై 10 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్, సిబ్బంది మోహన్‌లాల్, గట్టయ్య, చంద్రశేఖర్, సుమలత పాల్గొన్నారు.

యువతి బలవన్మరణం



గంగజల(ఫైల్)

కోరుట్లరూరల్: పైడిమడుగు గ్రామంలో తోకల గంగజల(22) అనే యువతి ఆత్మహత్య కు పాల్పడింది. పోలీసుల కథ నం ప్రకారం.. డిగ్రీ పూర్తి చేసిన గంగజల కొంతకాలంగా కడు పు నొప్పితో బాధ పడుతోంది. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మృతురాలి తండ్రి తోకల దేవయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తోకల దేవయ్య–నర్సవ్వ దంపతులకు కుమారుడు, కూతురున్నారు. కూతురి మృతితో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పైడిమడుగు గ్రామానికి చెందిన సంకె మణిదీప్(24) అనే యువకుడు మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కోరుట్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స అందిస్తున్నారు. పైడిమడుగులో ఒకేరోజు గంగజల ఆత్మహత్య చేసుకోవడం, మణిదీప్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం చర్చనీయాంశమైంది.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ధర్మారం(ధర్మపురి): బుచ్చయ్యపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే గ్రామంలో ఉంటున్న పల్లెవారి గణేశ్(48) అక్కడికక్కడే మరణించాడు. ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం తుమ్మవారిగూడేనికి చెందిన పల్లెవారి గణేశ్.. బుచ్చయ్యపల్లి గ్రామానికి వలస వచ్చి కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. మంగళవారం గణేశ్ బొట్లవనపర్తి నుంచి బుచ్చయ్యపల్లికి సైకిల్ వస్తుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్‌ట్రాలీ ఢీకొట్టింది. గణేశ్ ట్రాలీవెనుక టైర్‌కింద పడి దుర్మరణం చెందాడు.

గ్రామ పంచాయతీ కార్మికుడి ఆత్మహత్య



గోపాల్(ఫైల్)

రామగిరి(మంథని):గ్రామ పంచాయతీ కార్మికుడు కన్నూరి గోపాల్(45)పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజాపూర్ గ్రామానికి చెందిన కన్నూరి గోపాల్ పంచాయతీ ట్రాక్టర్ డైవర్‌గా పనిచేస్తున్నాడు. కొద్దినెలలుగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 3న ఇంట్లో గొడవ చేశాడు. అనంతరం కుటుంబ సభ్యులు గంగస్నానం కోసం వెళ్లగా గోపాల్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నాడు. అక్కడ పురుగులమందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు పెద్దపల్లి ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య చికిత్స కోరకు కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతు సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి ప్రసాద్ తెలిపారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

సైదాపూర్: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన సైదాపూర్ మండలంలోని వెన్కెపల్లి, దుద్దెనపల్లి ఉన్నత పాఠశాలలను సిక్కిం రాష్ట్ర ఐజీ క్యాడర్ అధికారి సోనమ్ టెన్సింగ్ భూటియా మంగళవారం పరిశీలించారు. అనంతరం ఠాణాలో పోలీసులతో సమావేశమయ్యారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ బూత్‌లను సందర్శించినట్లు తెలిపారు. వారికి పలు సూచనలు చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ఎక్కువ దృష్టిపెట్టాలని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు తమ ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్, ఎస్‌ఐ ఆరోగ్యం ఉన్నారు.

గవర్నర్ పురస్కారానికి ఎంపిక

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని గాయత్రీ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సోపాన్ టెస్టింగ్ క్యాంప్‌లో ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయి గవర్నర్ పురస్కారానికి అర్హత సాధించారు. దీంతో డీసీపీ చేతన వారిని మంగళవారం అభినందించారు. ఈనెల 5నుంచి 10వ తేదీ వరకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని సరస్వతీ శిశుమందిర్‌లో జరిగిన పోటీల్లో గాయత్రీ విద్యానికేతన్‌కు చెందిన విష్ణుప్రియ, మహాలక్ష్మి, లయవర్ధిని, సాహిత్య, లాస్య, వైశాలి ప్రతిభ కనబర్చి గవర్నర్ పురస్కారానికి అర్హత సాధించారు. విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజని, గైడ్ కెప్టెన్ స్రవంతి పాల్గొన్నారు.

భగవద్గీతను అనుసరించాలి

- శ్రీమాన్ నంబి వేణుగోపాలచార్య కౌశిక



ప్రవచిస్తున్న శ్రీమాన్ నంబి వేణుగోపాలచార్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రతి ఒక్కరూ భక్తిభావంతో నిత్యం భగవద్గీతను అనుసరించాలని జగిత్యాలకు చెందిన శ్రీమాన్ నంబి వేణుగోపాలచార్య కౌశిక అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సత్సంగ సదన 63వ వార్షికోత్సవంలో భాగంగా కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం శ్రీమద్భాగవత సప్తాహం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు ప్రవచనాలు వినిపించారు. భగవద్గీతను అనుసరించి ముందుకు సాగితే అన్ని శుభాలు జరుగుతాయన్నారు. భక్తితోనే ముక్తి లభిస్తుందని, ప్రతిరోజు దేవుడిని కొలుస్తూ పనులు చేపట్టాలని, అన్ని విజయవంతమవుతాయని అన్నారు. సృష్టిలో దేవుడిని మించిన శక్తి మరొటి లేదన్నారు. భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న రాఘవన్

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం శ్రీరాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.రాజగోపాల్ మాట్లాడుతూ, దేశంలో ప్రతి 4 నిమిషాలకు ఒకరు రహదారి ప్రమాదంలో ఎక్కువగా యువత ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ ప్రమాదాలతో కుటుంబ సభ్యులకు ఆవేదన, దేశ ఆర్థిక పరిస్థితికి పెద్ద ఎత్తున నష్టం జరుగుతోందన్నారు. అనంతరం ముఖ్య అతిథి మండేపల్లి డ్రైవింగ్ స్కూల్ ట్రైడ్స్ ప్రిన్సిపాల్ రాఘవన్ మాట్లాడుతూ, లైసెన్స్ లేకుండా వాహనాలను నడపవద్దన్నారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కారులో సీటు బెల్ట్ పెట్టుకోవాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే 108కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీదేవి, రవికుమార్, ప్రభాకరాచారి, కృష్ణ, మనోహర్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎన్టీపీసీ యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ నేత భిక్షపతి



వినతి పత్రం అందిస్తున్న నాయకులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఎన్టీపీసీ యునైటెడ్ ఎంప్లాయస్ యూనియన్(సీఐటీయూ) అధ్యక్షుడు ఎస్.భిక్షపతి అన్నారు. ఎన్టీపీసీలో ఈదునూరు భూమయ్య అధ్యక్షతన మంగళవారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26న గుజరాత్‌లోని వడోదరలో నిర్వహించే ఎన్టీపీసీ ఎన్బీసీ సమావేశంలో సమస్యలపై చర్చిస్తామన్నారు. డబ్ల్యూ–0, డబ్ల్యూ–1గ్రేడ్ ఉద్యోగులకు మెడికల్, పదవీ విరమణ తర్వాత మెడికల్ సౌకర్యం పొందేందుకు 15ఏళ్ల సర్వీస్ నిబంధన తొలగింపు, 13ఏళ్లుగా పదోన్నతులు పొందని డబ్ల్యూ–1 గ్రేడ్ ఉద్యోగులకు డబ్ల్యూ–2 గ్రేడ్ పదోన్నతికి ఉన్న ఎనిమిదో తరగతి విద్యార్హత నుంచి మినహాయింపు, కెరీర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (సీడీపీ) ప్రవేశపెట్టి కిందిస్థాయి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే పథకం పునరుద్ధరణ తదితర అంశాలపై ఏజీఎం(హెచ్ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్‌కు వినతిపత్రం అందించామని అన్నారు.

నూతన కార్యవర్గం

సమావేశం అనంతరం యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా ఎర్రవెల్లి ముత్యంరావు, అధ్యక్షుడిగా ఎస్.భిక్షపతి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా భూమయ్య, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్, ఉపాధ్యక్షులుగా సాంబయ్య, రాసపల్లి సంపత్, సారయ్య, కార్యదర్శులుగా ఎం.కుమార్, శంకర్, రామాచారి, కోశాధికారిగా భిక్షపతి, సభ్యులుగా గణేశ్, వీరయ్యను ఎన్నుకున్నారు.

'గ్రంథాలయ స్థలం కబ్జా చేస్తే ఊరుకునేది లేదు'

గోదావరిఖని(రామగుండం): ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు–3 కింద 1994లో భూములు కోల్పోయిన వారికి, ఐఎఫ్‌టీయూ కార్యాలయం కోసం కేటాయించిన స్థలాన్ని కబ్జా చేస్తే ఊరుకోబోమని ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.విశ్వనాథ్ హెచ్చరించారు. మంగళవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. 2000 సంవత్సరంలో స్థానిక ప్రశాంత్‌నగర్‌లో సింగరేణి యాజమాన్యం స్థలాలను కేటాయించిందని గుర్తు చేశారు. రాజీవ్ రహదారి సమీప స్థలం 23 ఏళ్లుగా యూనియనల్ అధీనంలోనే ఉందన్నారు. కార్మికుల కోసం చివరిదాకా పోరాడి అమరుడైన యు.రాములు స్మారక గ్రంథాలయానికి ఆ స్థలం కేటాయించినట్లు పేర్కొన్నారు. రూ.కోట్లు విలువ చేసే ఈ స్థలంపై కొందరు కబ్జా చేసేందుకు కన్నేసినట్లు చిత్రీకరించి తప్పుడు పత్రాలు సృష్టించి జీవో నంబర్ 76 ఆధారం చేసుకుని అక్రమంగా పట్టా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. ఇదే స్థలంలో రోడ్డు వెడల్పు కింద దుకాణాలు కోల్పోయిన చిరువ్యాపారులు తమ జీవనోపాధి కొనసాగిస్తున్నారన్నారు. వారిని సైతం బెదిరింపులకు గురిచేస్తూ అక్రమంగా పట్టా పొందిన వారు దౌర్జన్యానికి దిగుతున్నారని పేర్కొన్నారు. దొంగ పట్టా చేసిన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై ధాన్యం.. జర పైలం..!

మల్యాల: రైతులు రోడ్డు వెంట ధాన్యం పోయడంతో ప్రమాదకరంగా మారాయి. మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసుకునేందుకు స్థలం లేక రైతులు రోడ్డుపై ధాన్యం కుప్పలు పోశారు. రాత్రి రోడ్డు వెంట వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలి. గతంలో ధాన్యం కుప్పలతో వాహనదారులు ప్రమాదాల బారిన సంఘటనలున్నాయి. రోడ్డుకు కొంత దూరంలో ధాన్యం పోసుకోవాలని, రోడ్డుపై ఉంచి ప్రమాదాలకు కారణం కావొద్దని వాహనదారులు కోరుతున్నారు.



మైసమ్మో.. మైసమ్మా..

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని పాతబస్టాండులో గల కట్టమైసమ్మ ఆలయ 21వ వార్షికోత్సవం నేత్రపర్వంగా జరిగింది. మంగళవారం అమ్మవారికి పెద్ద సంఖ్యలో బోనాలు సమర్పించడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరు ప్రవీణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్ జాగీరు శైలు, అర్బన్‌బ్యాంకు డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, పట్టణ ప్రముఖులు, ప్రజలు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.